బీజేపీ చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలి


ఈటల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌నాథ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం నాగోలులో ఆమె ఈటల ఎన్నికల ప్రచార రథానికి పూజ చేసి అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని నాయకులకు సూచించారు. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తున్న ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటి ఇంటికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బద్దం బాలకృష్ణ గౌడ్, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవరెడ్డి, కేసీ రెడ్డి పద్మారెడ్డి, వస్పరి మల్లేష్, నరేందర్ సింగ్ , రాము గౌడ్, మనోజ్ కుమార్, చరణ్ సాగర్, గోపాల్ శర్మ, శ్రీకాంత్, మనోజ్ పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తా


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని సాయిప్రకాశ్‌నగర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతా నాయక్ మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సూచించారు. నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాఘవేందర్, ప్రవీన్, రాజశేఖర్, రామచంద్రనాయక్, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో ముమ్మరంగా వాహన తనిఖీలు

సైదాబాద్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రీన్‌పార్క్ కాలనీ చెక్‌పోస్ట్ వద్ద ఆయన పోలీస్ బలగాలతో కలిసి ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. సిబ్బందితో కలిసి రెండు గంటలు ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు అందరూ నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్

తనిఖీల్లో సైదాబాద్ పీఎస్ ఎస్ఐలు, సిబ్బంది, ఆర్‌టీఏ, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

జాతీయ బంజార మిషన్ తెలంగాణ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

లింగోజిగూడ: జాతీయ బంజార మిషన్ (భారత్) తెలంగాణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కర్మన్‌ఘాట్ గ్రీన్ పార్క్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కమిటీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజయ్య, వర్కింగ్ అధ్యక్షుడిగా రాజేష్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. బంజార మిషన్ జాతీయ నాయకులు ప్రసాద్ నాయక్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బిచ్యానాయక్ బావాజీ, రవినాయక్, తులసీరాం, సేవాలాల్, వెంకట్‌రాథోడ్, లక్ష్మీబాయి, దుర్గాబాయి, మంగ్లీబాయి, శ్రీదేవి, సుజాత, అలివేలు, సీమారాథోడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలి

సైదాబాద్: విద్యార్థులకు ఆసక్తి గల రంగంలో తగిన ప్రోత్సాహంతో కూడిన శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఆయా రంగాలలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కె.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంపాపేటలోని పాఠశాలలో టాట్ ఫీస్టా–వేర్ లెర్నింగ్ మీట్స్ ఫన్ పేరిట నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీత్రివేణి పాఠశాలకు చెందిన ప్రాథమిక తరగతుల విద్యార్థులు పలు అంశాలలో నమూనాలను ప్రదర్శించారు. కలర్స్, సీజన్స్, ఫెస్టివల్స్, నంబర్స్, ఫోనిక్ సౌండ్స్ వంటి అంశాల్లో పలు విషయాలను కార్యాచరణ ఆధారిత అభ్యాసం విధానంలో విద్యార్థులు ఆహూతులకు చక్కగా వివరించారు.


నమూనాలు వివరిస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మాధురి, శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బధిర మహిళలకు అన్ని రకాల న్యాయ సహాయం అందిస్తాం..


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాపోల్ భాస్కర్

మలక్‌పేట: ఫిన్ బధిరుల స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ హియరింగ్ హ్యాండ్ క్యాప్డ్ అసోసియేషన్ ఎంప్లాయీస్ (టీహెచ్‌హెచ్ఏఈ) మహిళా విభాగం కేంద్ర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మలక్‌పేట ఆర్యవైశ్య సంఘ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోల్ భాస్కర్ మాట్లాడుతూ.. బధిర మహిళలకు అన్ని రకాల న్యాయ సహాయం అందించడానికి ఎల్లప్పుడు ముందుంటామని తెలిపారు. న్యాయ విద్య పట్ల ఆసక్తి ఉన్న బధిర విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఫిన్ స్వచ్ఛంద సంస్థ వారు మాట వినికిడి లోపం గల 100 మంది పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫిన్ అధ్యక్షురాలు జానకి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, ప్రాజెక్ట్ ప్రిసా ఫౌండర్ జొన్నల గడ్డ యశస్వి, వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షులు శ్రీనివాసులు, సంఘం ఉపాధ్యక్షురాలు డేవిడ్ సోఫియా ప్రణతి, మిషా, మంజు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడికి సేవారత్న పురస్కారం


రాజేష్‌కు అవార్డు అందజేస్తున్న వెంకటరెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమం 3వ వార్షికోత్సవ వేడుకలు ఆల్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్‌కే ఫౌండేషన్ రెస్క్యూ టీం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా మధిర రెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో సమాజంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధిరకు చెందిన భరత్ విద్యాసంస్థల చైర్మన్ శీలం వెంకట రెడ్డి ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆర్‌కే ఫౌండేషన్ రెస్క్యూ టీం అధ్యక్షుడు ధోర్నాల రామకృష్ణ మాట్లాడుతూ, గత 32 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల అనాథ, నిరుపేద విద్యార్థులకు ఉచిత భోజన, వసతి, విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నందుకు అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌ను ఉత్తమ సేవా రత్న పురస్కారానికి ఎంపిక చేశామని చెప్పారు. హైదరాబాద్ వైష్ణవి చారిటబుల్ చైర్మన్ రమణారావు, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు దాసు, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ విద్యాలత పాల్గొన్నారు.

శరవేగంగా కమ్మరికుంట కట్ట పనులు

తీరనున్న ప్రయాణికుల కష్టాలు • పనులు పూర్తైతే 20 కాలనీలకు ప్రయోజనం


చెరువు కట్ట పటిష్టతకు చేపట్టిన రాతి కట్ట నిర్మాణం

హయత్‌నగర్: కుమ్మరికుంట చెరువు కట్ట పటిష్టత, వెడల్పు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. హయత్‌నగర్ నుంచి సాహెబ్‌నగర్ మీదుగా బీఎన్ రెడ్డి కాలనీ వరకు ఉండే లింకు రోడ్డు ఈ కట్టపై నుంచే వెలుతుంది. గత 2020 అక్టోబర్‌లో వచ్చిన భారీ వరదలకు కుమ్మరికుంట నిండి కట్ట కొంత భాగం కోతకు గురై బలహీన పడింది. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి కట్టపై నుంచి వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు కట్టపై గుంతలు ఏర్పడటంతో ఈ దారిలో వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుమ్మరికుంట చెరువు కట్ట బలహీనంగా ఉన్న కారణంగా ప్రతి వర్షాకాలంలో కట్టపై వాహనాల రాకపోకలను అధికారులు నిషేధిస్తున్నారు. అప్పటి నుంచి కట్టను పటిష్టం చేయడంతో పాటు దానిపై రోడ్డును వెడల్పు చేయాలనే డిమాండ్ పెరిగింది.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు..

మూడేళ్లుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నా పెడచెవిన పెట్టిన అధికారులు ఎట్టకేలకు కోటి రూపాయల వ్యయంతో చెరువు కట్టను పటిష్ట పర్చేందుకు పూనుకున్నారు. ఇందులో భాగంగా రాతి కట్టడం పనులను మొదలు పెట్టి వేగవంతంగా చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే హయత్‌నగర్ నుంచి సాహెబ్‌నగర్‌కు వెళ్లే దారిలో ఉన్న సుమారు ఇరవై కాలనీల ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

అదనపు నిధులు మంజూరు చేయాలి



కట్టను పటిష్టం చేయడంతో పాటు కట్టపై రోడ్డును డబుల్ రోడ్డుగా తీర్చిదిద్దాలి. కట్టతో పాటు చెరువులోకి మురుగు నీరు చేరకుండా కాలువను మళ్లించాలి. చెరువు నీరు కలుషితం కాకుండా దీర్ఘకాలిక చర్యలు తీసుకుని కట్టపై ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. ఈ పనుల కోసం అదనపు నిధులు మంజూరు చేయాలి. – నవజీవన్ రెడ్డి, కార్పొరేటర్, హయత్‌నగర్

చెరువు కుంచించుకు పోకుండా చూడాలి



కట్ట వెడల్పు పనుల వల్ల కుమ్మరికుంట చెరువు పరిధి కుంచించుకు పోతుంది. ఇప్పటికే ఎఫ్‌టీఎల్ పరిధిని తగ్గించడంతో చెరువు పరిధి తగ్గింది. కట్ట వెడల్పు పనులతో చెరువు పరిధి మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది. చెరువు పూడిక తీత పనులు వెంటనే చేపట్టాలి. – పిడుగు శ్రీనివాస్ ముదిరాజ్, అధ్యక్షుడు మత్స్య పారిశ్రామిక సంఘం, హయత్‌నగర్

ముస్లింలకు రెండు సీట్లు కేటాయించాలి

చాదర్‌ఘాట్: సెక్యులర్ పార్టీగా పేరుగాంచిన బీఆర్ఎస్ ముస్లింలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని కులీకుతుబ్‌షా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మౌలానా ఇర్ఫాన్ జాఫ్రీ కోరారు. ఆదివారం అజంపురాలో నిర్వహించిన సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ అభ్యర్థన పట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామన్నారు. సమావేశంలో సొసైటీ సభ్యుడు లాయక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఎల్‌బీనగర్: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని గ్రేటర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంరెడ్డి భుజంగ రెడ్డి తదితరులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో రాంరెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన


సాయి ఆలయంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత డెంటల్ క్యాంప్‌కు భారీ స్పందన వచ్చిందని ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. తేజశ్రీ డెంటల్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్యశిబిరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పంటి పరీక్షలు చేయించుకున్నారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ మాజీ అధ్యక్షులు, సంస్థాన్ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

19, 20 తేదీలలో సిటీ కాలేజీలో జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీలలో జాతీయ సదస్సు జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. రసాయన శాస్త్రం –బహు శాస్త్రాంతార పరిశోధన అవకాశాలు అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యం, లారస్ లాబ్స్, ఎస్ ఎస్ కె బయో సైన్సెస్ సహకారం అందిస్తున్నాయన్నారు. కెమిస్ట్రీ విభాగం అధ్యక్షుడు డా.ఏలూరి యాదయ్య సమన్వయం చేస్తున్న ఈ సదస్సులో రాష్ట్ర, రాష్ట్రేతర అధ్యాపకులు, ఆచార్యులు పాల్గొంటున్నారన్నారు. 19వ తేదీ ప్రారంభ సభను ఐఐసిటి సంచాలకులు డా.డి.శ్రీనివాస రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ సదస్సులో ప్రముఖ పరిశోధకులు ఆచార్య సీహెచ్. సుబ్రహ్మణ్యం, డా.కె.రాజేందర్ రావు, డా.ఎన్. రవికుమార్ రెడ్డి, డా.పి.దివాకర్ తదితరులు పాల్గొంటారన్నారు. ఇతర దేశాల నుంచి శాస్త్ర వేత్తలు ఆన్‌లైన్ లో పత్ర సమర్పణ చేస్తారన్నారు. డా.విప్లవ్ దత్ శుక్లా, డా.దయానంద్, వసంత, అనిల్ బూసి, డా.రత్న ప్రభాకర్, డా.జె.నీరజ, డా.రవి కుమార్, డా.శంకర్, డా.భాస్కర్ సదస్సు నిర్వహణలో సహకరిస్తారని కార్యక్రమం సమన్వయకర్త డా.యాదయ్య తెలిపారు.

టీపీసీసీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్‌గా వెంకన్నగౌడ్


మధుయాష్కీ నుంచి నియామకపత్రం అందుకుంటున్న వెంకన్నగౌడ్

మన్సూరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన చెన్నగాని వెంకన్నగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ నియామకపత్రాన్ని జారీ చేసి ఆదివారం వెంకన్నగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకన్నగౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను పాటిస్తూ పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తానని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జాలే వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మనోహర్, శేఖర్‌గౌడ్, కదారి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

హయత్‌నగర్: శ్రీ సాయి తేజస్వీ పాలీక్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్ వారు ఆదివారం హయత్‌నగర్‌లోని సూర్యానగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రోగాలతో బాధపడుతున్న పలువురు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేసుకున్నారు. డాక్టర్ గుత్తా శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవసరమైన వారికి మందులు అందించారు. అర్హులైన వారికి 50 శాతం ఫీజు రాయితీతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు జె.వీర్స్వామి, ఉపేందర్, సుమన్‌రెడ్డి తదితరులు సేవలు అందించారు.


వైద్య శిబిరంలో బాధితులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు

నాగోలు: చిన్నాతనం నుంచి విద్యార్థులకు చదువుతో పాటు విలువలు నేర్పిస్తున్నామని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవి అన్నారు. కొత్తపేట బచ్‌పన్, అకడమిక్ హైట్స్ పాఠశాలలో ఆదివారం యూకేజీ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్రదేవి మాట్లాడుతూ, విద్యార్థులు భారత పౌరులుగా ఎదగడానికి పాఠశాల తొలిమెట్టు అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌లో నిర్వహించే బచ్‌పన్ టాగ్‌లైన్ వుయ్ టీచ్ లైఫ్ తో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాఠశాల ఇన్‌చార్జ్ స్వీటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీసాయినగర్‌కాలనీ నూతన కమిటీ ఎన్నిక


గణేష్‌యాదవ్ అధ్యక్షుడు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కాలనీ కమ్యూనిటీహాల్‌లో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పోచబోయిన గణేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా రమణమూర్తి, అశోక్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా సత్తిరెడ్డి, రవి, కోశాధికారిగా హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా యాదగిరి, మురళీమోహన్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు లక్ష్మయ్య, రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గణేష్‌యాదవ్ మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా కాలనీవాసులు ఎన్నుకుంటున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తూ కాలనీ అభివృద్ధికి పాటుపడతానని ఆయన స్పష్టం చేశారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయం

కొండా సంగీతారెడ్డి

మీర్‌పేట: బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమని సతీమణి సంగీతారెడ్డి పేర్కొన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి మోడీ నాయకత్వాన్ని బలపరచాలని ఆమె వాకర్స్‌ను కోరారు. ఆదివారం ఉదయం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు వద్ద కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆమె ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయాలతో విడదీయరాని సంబంధం ఉందని, ఉపకారమే తప్ప అపకారం చే యని వ్యక్తిత్వమన్నారు. మరోసారి మోదీ ప్రధాని అవుతారని, చేవెళ్లలో విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయ మని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో మీర్‌పేట పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, భిక్షపతిచారి, కీసర హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

సీఎంకు మల్‌రెడ్డి కృతజ్ఞతలు



ఎల్‌బీనగర్: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రికి రాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ. లక్ష స్వాధీనం


వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ జానకి, ఏసీపీ శ్యామ్‌సుందర్

మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆదివారం మలక్‌పేట పోలీసులు దిల్‌సుఖ్‌నగర్‌లో వాహనాలు తనిఖీలు చేపట్టారు. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి, మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి రాజీవ్ చౌక్‌లో వాహనాలను తనిఖీలు చేశారు. తనిఖీల్లో లక్ష రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎవరి వద్ద అయినా ఎలాంటి ఆధారాలు లేకుండా 50 వేల రూపాయలకంటే ఎక్కువ నగదు ఉంటే స్వాధీనం చేసుకుంటామని ఆయన అన్నారు. ఎన్నికలు సజావుగా కొనసాగడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 11, వంకాయ 28, బెండ 45, పచ్చి మిర్చి 55, కాకర 38, బీర 40, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 19, దొండ 16–23, చిక్కుడు 23–55, గోకర 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 60, ఆలు 25, దోస 18, సొర 9, పొట్ల 15, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 45. గమనిక: ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఈవెంట్ మేనేజర్ అదృశ్యం


రాహుల్ సింగ్

మలక్‌పేట: ఈవెంట్ మేనేజర్ అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం... బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా హాజీపూర్ మండలం అక్లియార్‌పూర్ గ్రామానికి చెందిన రాహుల్ సింగ్(34), శ్వేత రాజ్ 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. సలీంనగర్ శ్రీపురం కాలనీలో నివాసం ఉంటూ ఈవెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. శ్వేత రాజ్ గర్భవతి కావడంతో బీహార్ రాష్ట్రం తూర్పు చంపారన్ జిల్లా, కస్బా గ్రామానికి వెళ్లింది. అక్కడ మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ నెల 11వ తేదీన ఆమె సలీంనగర్‌కు రాగా ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో ఆందోళన చెందిన ఆమె తెలిసిన వారి వద్ద, చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

జెడ్ఈఓ అంకమరావు

మీర్‌పేట: చదువుతో పాటు క్రీడలు అవసరమని మీర్‌పేట భాష్యం స్కూల్ జెడ్ఈఓ అంకమరావు పేర్కొన్నారు. ఆదివారం జోన్ స్థాయి క్రీడోత్సవాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తమ విద్యాసంస్థల్లో క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. జోన్–3 విభాగంలోని 8 బ్రాంచిల్లోని విద్యార్థులు పలు రకాల ఆటలపోటీల్లో పాల్గొన్నారు. దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందారని ప్రిన్సిపాల్ స్రవంతి, హెడ్ మిస్ట్రెస్ శృతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారీ పరేడ్ నిర్వహించారు.

చల్లాకు శుభాకాంక్షల వెల్లువ

మీర్‌పేట: పట్టణ మౌలిక సదుపాయాలు ఆర్థిక సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లెలగూడలోని ఆయన నివాసానికి చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వెళ్లి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మురళీగౌడ్, విజయ్, పరశురాం, గాజుల ఆనంద్, ఎర్ర చంద్రమోహన్, గల్లా శ్రీకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంజీరా అకాడమీ ఆఫ్ కూచిపూడి డాన్స్ గురువు రేణుక ప్రభాకర్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. మోదమున.. కంజదళయాదాక్షి.. అయిగిరి నందిని.. కొలువై ఉన్నడే తదితర కీర్తనలు సైతం వీనుల విందుగా కొనసాగాయి.

అభివృద్ధి పనులకు రూ. 25 లక్షలు మంజూరు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ శ్రీనగర్ కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం రూ.25 లక్షలను మంజూరు చేసినట్టు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన నిధుల మంజూరు పత్రాన్ని కాలనీ సంఘాల పెద్దలకు ఆదివారం అందజేశారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిధులు విడుదల చేయిస్తున్నట్టు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.